క్లుప్తంగా

వాహనాల రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద ఉన్న తాత్కాలిక వంతెన మీదుగా వాహనాల రాకపోకలకు అధికారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయరత్నం బుధవారం అక్కడికి వెళ్లి, వంతెన పరిస్థితిని పరిశీలించారు. ఇకనుంచి వంతెన మీదుగా అధిక లోడు వాహనాలు వెళ్లొచ్చని తెలిపారు. పాత వంతెన మీదుగా మాత్రం స్వల్ప లోడుతో వెళ్లే వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని పోలీసులు వెల్లడించారు.

నేడు గ్రామ సందర్శన

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మండల నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు హాజరుకానున్నారని, మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా రావాలని కోరారు.

బొబ్బిలి: పట్టణంలో మూడో వార్డు సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు, సచివాలయ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవో రమామణి

రామభద్రపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా కె.రమామణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో ఇక్కడికి బదిలీపై వచ్చిన ఎంపీడీవో ఈశ్వరమ్మ శ్రీకాకుళం జిల్లా వెళ్లిపోవడంతో విశాఖపట్నం జిల్లా నుంచి రమామణి ఇక్కడికి వచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ, సహకారాలతో మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని వెలగవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం నేత్ర వైద్య పరీక్షలు చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో చీపురుపల్లి సీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి తోట లక్ష్మి విద్యార్థుల కళ్లను తనిఖీ చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు వాడాలని సూచించారు. కంటిచూపు బాగుండాలంటే ఎక్కువగా ఆకుకూరలు తినాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ధనంజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం రేపు

సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అధికారి వసంతరావు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని, ఆపరేషన్లు అవసరమైన వారిని అదేరోజు విజయనగరం ఆస్పత్రికి తరలించడం జరుగుతుందన్నారు.

కలెక్టర్‌కు విరాళం చెక్కు అందజేత


కలెక్టర్ అంబేడ్కర్‌కు చెక్కు అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాలను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు బుధవారం అందజేశారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు పలువురు సామాజిక కార్యకర్తలతో కలిసి సేకరించిన రూ.5 వేలను అందించారు. కార్యక్రమంలో పి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వితరణ


సౌండ్‌బాక్స్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రేగిడి: మండలంలోని పెదలింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు(1996–97 టెన్త్ బ్యాచ్) సౌండ్‌బాక్స్, మైక్ వితరణ చేశారు. రూ.20 వేల విలువైన ఆ సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు దాసరి కృష్ణారావుకు సుధీర్, నేతాజి, హరి, పాపయ్యలు బుధవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం చాలా ఆనందంగా ఉందని వారు అన్నారు.

బంద్ ప్రశాంతం

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్‌బంద్ ప్రశాంతంగా సాగింది. జాతీయ మాల మహానాడు ఇచ్చిన పిలుపు మేరకు అన్ని ప్రాంతాల్లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు, మాల మహానాడు నాయకులంతా నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు, ఆందోళనలు బుధవారం నిర్వహించారు. వర్గీకరణ వద్దు, ఐక్యతే ముద్దు అని నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి విరుద్ధమని, కేవలం రాజకీయ కుట్రతో కూడుకున్న తీర్పని అన్నారు. దళిత బహుజనుల రాజకీయ పురోగమనాన్ని అడ్డుకునేందుకు అగ్రవర్ణ రాజకీయ పార్టీలు ఈ కుట్రకు పూనుకున్నాయని, అన్నివర్గాల ప్రజలు దీనిని వ్యతిరేకించాలని కోరారు. బంద్ కారణంగా ప్రధాన వీధులు, రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. కొన్నిచోట్ల వాణిజ్య సంస్థలు, పలు కార్యాలయాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. – బొబ్బిలి, రాజాం


రాజాం సిటీ: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు


వంగర: మండల కేంద్రంలో బస్సులను నిలుపుదల చేస్తున్న దృశ్యం


బొబ్బిలి: మండల కేంద్రంలో చేపట్టిన రాస్తారోకోలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య తదితరులు



వంగర: మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకును మూసివేస్తున్న దళిత సంఘాల నాయకులు


రామభద్రపురం: బంద్ కారణంగా మండల కేంద్రంలో పాఠశాలలు మూసివేయడంతో ఇంటికి వెళ్లిపోతున్న విద్యార్థులు


తెర్లాం: పెరుమాళి రోడ్డులో ఎస్సీ వర్గీకరణ వద్దు అని ర్యాలీ చేస్తున్న మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు


తెర్లాం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తున్న మండల మాల మహానాడు నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

3,4,5 తరగతులు పునరుద్ధరించండి

బొబ్బిలి రూరల్: మండలంలోని నిమ్మలపాడు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 3, 4, 5వ తరగతులను పునరుద్ధరించాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో చల్లా లక్ష్మణరావును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సభ్యురాలు వి.విజయగౌరి మాట్లాడుతూ ఇదే పాఠశాలలో గతంలో 3, 4, 5 తరగతులు నిర్వహించేవారని, విద్యాసంస్కరణల్లో భాగంగా ఆయా తరగతులను ఇక్కడ నిర్వహించకుండా కేవలం 1, 2 తరగతులను మాత్రమే నడుపుతున్నారన్నారు. దీంతో గ్రామానికి చెందిన చాలామంది విద్యార్థులు 3, 4, 5 తరగతుల కోసం 3 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మరీ వెళ్లాల్సి వస్తోందన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా ఇక్కడే ఆయా తరగతులను మళ్లీ కొనసాగించాలని కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, కేశవరావు, శ్రీనివాస్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎంఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు


ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది గంగాధర్

వినతిపత్రం అందజేత

బొబ్బిలి: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం శిక్షణ తరగతులు నిర్వహించాలని న్యాయవాది గంగాధర్ కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో ఆర్డీవో ఎ.సాయిశ్రీని బుధవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత కాలంలో మహిళలు, బాలికలు, విద్యార్థినులపై ఎక్కడపడితే అక్కడ లైంగికదాడులు, అత్యాచార, హత్యాచార యత్నాలు జరుగుతున్న నేపథ్యంలో వారికి శిక్షణ ఇవ్వడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. కుంగ్‌ఫూ, కరాటే, బాక్సింగ్ వంటి ఆత్మరక్షణ విద్యలు నేర్పించాలన్నారు.

సవాళ్లు అధిగమిస్తేనే పారిశ్రామికవేత్తలకు గుర్తింపు

రాజాం సిటీ: తమకు ఎదురైన సవాళ్లను అధిగమిస్తేనే పారిశ్రామికవేత్తలకు మంచి గుర్తింపు లభిస్తుందని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో ప్రపంచ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, అందుకు నిర్మాణాత్మక ప్రణాళిక అవసరమన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశ్రమలు ప్రారంభించేందుకు పుష్కలంగా వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కళాశాలలో చదువుకుని పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్న పూర్వ విద్యార్థులు శ్రీ ప్రఖ్య రెన్యువబుల్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ బూర్లే, 3ఎఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నోల్యాబ్ సీఈవో పి.ఉమేష్, డిజైన్ 2 డిజైర్ ఇంజినీర్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సోమశేఖర్‌నాయుడు, ఇంచెక్షింటీరియో మేనేజింగ్ డైరెక్టర్ జి.కల్కినాథ్, జి.శ్రావణ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ఈడీసీ కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్న పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న సిబ్బంది

మెరుగైన విద్యనందించాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని గంగన్నపాడు గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు, విద్యార్థుల చేతిరాత, హోమ్‌వర్క్ పుస్తకాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని, హోమ్‌వర్క్ పుస్తకాలను దిద్దాలని తెలిపారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలన్నారు.

● గుర్రపుడెక్క తొలగించండి సారూ..!


రంగారాయపురం వద్ద గుర్రపుడెక్కతో నిండిన నారాయణపురం ఆనకట్ట కుడి ప్రధాన కాలువ

సంతకవిటి మండలంలోని రంగారాయపురం వద్ద నారాయణపురం ఆనకట్ట నుంచి ప్రారంభమైన కుడి ప్రధాన కాలువలో గుర్రపుడెక్క, తూటికాడలు విపరీతంగా పేరుకుపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. సాగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడంతో తగినంతగా నీరు ప్రవహించడం లేదని, కాలువగట్లకు కూడా గండిపడి పంటపొలాలు నీటమునిగిపోయే ప్రమాదం ఉందని రంగారాయపురం, వాసుదేవపట్నం, పోతులజగ్గుపేట అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి, గుర్రపుడెక్క తొలగించండి సారూ అని అభ్యర్థిస్తున్నారు. – సంతకవిటి

'ఉపాధి' పనులు కల్పించండి

వంగర: మండలంలోని మగ్గూరులో ఉన్న ఉపాధి హామీ పథకం వేతనదారులకు పనులు కల్పించాలని సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నిధులు లేవన్న కారణంగా గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టకపోవడంతో చాలామంది గ్రామస్తులు వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మద్దువలస ఎడమ కాలువలో పేరుకుపోయిన జంగిల్స్‌ను తొలగించే పనులు ఉపాధి పనుల్లో భాగంగా చేపట్టాలన్నారు.

పారదర్శకంగా సేవలందించాలి


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

సంతకవిటి: సచివాలయానికి వచ్చే ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని ఎంపీడీవో జి.వి.రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయాన్ని బుధవారం సందర్శించిన ఆయన.. రికార్డులు తనిఖీ చేసి, సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. ఏదైనా సమస్యతో వచ్చే వారిని నిర్లక్ష్యం చేయకుండా వారి సమస్యను సకాలంలో పరిష్కరించాలన్నారు.

వసతిగృహాల సందర్శన


వసతిగృహాల్లోని వసతులపై ఆరాతీస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

బొబ్బిలి: పట్టణంలోని హ్యాండ్ ఇన్ హ్యాండ్ సొసైటీ అనాథ ఆశ్రమంతో పాటు ఐరిస్ హాస్టల్ హోమ్, పాతబొబ్బిలిలోని చిల్డ్రన్స్‌హోమ్‌లను ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి బుధవారం సందర్శించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆయా గృహాల్లో ఉంటున్న పిల్లలకు వసతి, ఆహారం, ఇతర సదుపాయాలు ఎలా ఉన్నాయన్న దానిపై ఆరాతీశారు. ప్రస్తుతం చూసిన వసతిగృహాల పరిస్థితులపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ


బొబ్బిలి రూరల్: ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి

బొబ్బిలి రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే రక్తహీనత సమస్యను నివారించవచ్చని ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని పిరిడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై బుధవారం అవగాహన కల్పించారు. రక్తహీనత బారినపడి బాధపడుతున్న విద్యార్థులంతా ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని, విద్యార్థినులు రుతుస్రావం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వండానపేట, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ మాట్లాడుతూ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు.

రాజాం: మండలంలోని గురవాం కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని ఎంఈవోలు బి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు అక్కడి సిబ్బంది, విద్యార్థుల హాజరుశాతం, విద్యార్థుల చదువుపై ఆరాతీశారు. ప్రతీ విద్యార్థి చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖప్రసవాలన్న భరోసానివ్వండి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు. మండలంలోని ఆరికతోట, రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రుల పరిసరాలతో పాటు ప్రసవాల గదులు, ల్యాబ్, రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆస్పత్రుల్లో ఎక్కువగా ప్రసవాలు జరిగేలా చూడాలని, అందులోనూ సాధారణ ప్రసవాలకు ప్రయత్నించాలని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖప్రసవాలు జరుగుతాయన్న నమ్మకం, భరోసాను ప్రజలకు ఇవ్వాలని ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వారానికోసారి వసతిగృహాలను సందర్శించి, అక్కడి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను బాగా చూసుకోవాలని, సత్వరమే వారికి వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రత్నదీపక్, దిలీప్ కుమార్, శిరీష, అపర్ణ, సీహెచ్‌వో రాజు, ఈవో మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.


ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శనలో డీఎంహెచ్‌వో భాస్కరరావు

కేసుల దర్యాప్తులో పురోగతి కనిపించాలి

బొబ్బిలి: కేసుల దర్యాప్తులో పురోగతి కనిపించాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. బొబ్బిలి అర్బన్ సీఐగా కె.సతీష్‌కుమార్, రూరల్ సీఐగా కె.నారాయణరావులు ఆయా స్టేషన్‌లలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు డీఎస్పీని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఏదైనా సమస్యతో స్టేషన్‌కు వచ్చేవారిని ప్రేమతో ఆహ్వానించి, వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి రవాణా, మద్యం అక్రమ రవాణా వంటి వాటిపై దృష్టిసారించాలని తెలిపారు. అలాగే కారాడ, ఉద్దవోలు గ్రామాల్లో దర్యాప్తు దశలో ఉన్న కేసుల వివరాలపై చర్చించి, దర్యాప్తు వేగవంతం చేయాలని తెలిపారు.


డీఎస్పీ శ్రీనివాసరావుతో సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావు

సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

రామభద్రపురం: రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని విద్యుత్ శాఖ డీఈ ఎం.ఉదయభానునాయుడు తెలిపారు. పీఎం కుసుమం పథకంలో భాగంగా మండలంలో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఆయన ఉప తహసీల్దార్ సుబ్బారావును బుధవారం కలిశారు. సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటు వల్ల రైతులకే కాకుండా మిగతా వినియోదారులకు కూడా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు దాదాపు 3 నుంచి 4 ఎకరాల స్థలం అవసరమవుతుందన్నారు.


ఉప తహసీల్దార్ సుబ్బారావుతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ డీఈ ఉదయభానునాయుడు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

రేగిడి: రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబెల్లి రమణలు సూచించారు. మండలంలోని వన్నలి, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, గుళ్లపాడు, ఉంగరాడ తదితర గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులు వినియోగించి సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసే వివిధ జీవామృతాలు, కషాయాలు పంటలపై పిచికారీ చేస్తే తెగుళ్ల, చీడపీడలు పంటకు సోకవన్నారు.


వన్నలిలో వరి పంటపై జీవామృతం పిచికారీ చేస్తున్న రైతులు

పరామర్శ

రాజాం: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు రౌతు అప్పలనాయుడు, రామచంద్రినాయుడును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల వారి సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు రామకృష్ణనాయుడు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని, బాధిత కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, సర్పంచ్‌లు జి.అప్పలనాయుడు, వి.విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ సామంతుల తవిటినాయుడు, ఓలేటి గణపతి, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

గ్రామసభల్లో 'ఉపాధి' పనుల గుర్తింపు

బొబ్బిలి/తెర్లాం/రామభద్రపురం/రాజాం/సంతకవిటి: మండలాల్లోని పలు గ్రామాల్లో మాక్ గ్రామసభలను అధికారులు బుధవారం నిర్వహించారు. రాజాం మండలంలోని పెనుబాక గ్రామంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, రామభద్రపురం మండలంలోని బూసాయవలస గ్రామంలో ఎంపీడీవో రమామణి, తెర్లాం, బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు శంబంగి రామకృష్ణ, రవికుమార్‌లు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమై ఈ నెల 23వ తేదీన ప్రతీ గ్రామంలో నిర్వహించాల్సిన గ్రామసభల నిర్వహణపై పలు సూచనలు చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఉపాధి హామీ పనులను గ్రామసభల్లో గుర్తించాలన్నారు. ఎక్కడెక్కడ పనులు కావాలో రైతులు, వేతనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, మెజార్టీ సభ్యుల ఆమోదం తెలిపిన ప్రాంతాల్లో వీలైనంత వరకు పనులు జరిగేలా చూడాలన్నారు.


తెర్లాంలో నిర్వహించిన మాక్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

పశువులకు 'గాలికుంటు' టీకాలు

తెర్లాం: వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు బుధవారం వేశారు. పాడిరైతులు తమ వద్ద ఉన్న అన్ని పశువులకు ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఈ టీకాలు వేయించాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి/రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com